క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



కమిషనర్‌కు సమస్యలను వివరిస్తున్న ప్రజలు

ఆదోనిటౌన్‌: ఆదోని మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వంప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని చేపట్టిందని మున్సిపల్‌ కమిషనర్‌ ఎం.కృష్ణ తెలిపారు. సోమవారం కమిషనర్‌ చాంబర్‌లో మీ కోసం కార్యక్రమాన్ని చేపట్టారు. పలు వార్డుల్లో నివాసముంటున్న ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమిషనర్‌, అసిస్టెంట్‌ కమిషనర్‌ అనుపమకు వివరిస్తూ దరఖాస్తులు చేసుకున్నారు. టౌన్‌ ప్లానింగ్‌, వాటర్‌ వర్క్స్‌లో అక్రమ కట్టడాల కూల్చివేత, సమయానికి తాగునీటిని సరఫరా చేయాలని కోరుతూ ప్రజలు కమిషనర్‌కు విన్నవిస్తూ దరఖాస్తులు చేసుకున్నారు.

మెప్మా అర్బన్‌ మార్కెట్‌ ప్రారంభం



అర్బన్‌ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్‌ కమిషనర్‌ కృష్ణ, చైర్‌పర్సన్‌ శాంత

ఆదోని టౌన్‌: స్థానిక నిర్మల్‌ టాకీస్‌ సర్కిల్‌లో సోమవారం ఐకేపీ మెప్మా ఆధ్వర్యంలో మెప్మా అర్బన్‌ మార్కెట్‌ను చైర్‌పర్సన్‌ బోయ శాంత, మున్సిపల్‌ కమిషనర్‌ ఎం.కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం మెప్మా మార్కెట్‌ను ప్రారంభించిందన్నారు. మెప్మా అర్బన్‌ మార్కెట్‌ ద్వారా పొదుపు సంఘాల మహిళలు తయారు చేసుకున్న వస్తువులను తామే విక్రయిస్తూ వచ్చిన సొమ్ముతో కుటుంబాలు ఆర్థికాభివృద్ధి చెందుతాయన్నారు.

చెత్త సంపద కేంద్రాల తనిఖీ



నందవరంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ సందీప్‌

నందవరం: మండల కేంద్రం నందవరంతో పాటు, నాగలదిన్నె, నద్దికైరవాడి, హాలహర్వి గ్రామాలలో చెత్త సంపద కేంద్రాలను ఈఓపీఆర్డీ సందీప్‌ సోమవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ..పంచాయతీలకు ఆదాయం సమకూరాలంటే చెత్త సంపద కేంద్రాల ద్వారా వానపాముల ఎరువులను తయారు చేసుకుని రైతులకు విక్రయించాలన్నారు. తద్వారా ఆదాయం వస్తుందన్నారు. అలాగే గ్రామాలలో ఎప్పటి కప్పుడు డ్రైనేజీలు, నీటి కుంటలు, మురుగు కాలువలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు విజయలక్ష్మీ, సుజాత, రామారావు, నొసన్న, పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్‌: డిసెంబర్‌ 14వ తేదీన జరగబోయే లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ సూచించారు. సోమవారం స్థానిక కోర్టులో ఆమె మాట్లాడుతూ కోర్టు ఎండింగ్‌లో ఉన్న రాజీ కాదగిన క్రిమినల్‌ కేసులు, సివిల్‌ కేసులు, మోటార్‌ యాక్సిడెంట్‌ కేసులను పరిష్కరించుకోవాలన్నారు. రాజీనే రాజమార్గమని చెప్పారు.

నేడు జాబ్‌మేళా




పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్‌: ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ ఆధ్వర్యంలో 29న జాబ్‌ మేళా నిర్వహిస్తున్నట్లు సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ వివి.జనార్దన్‌ రెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో జాబ్‌ మేళాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కళాశాలలో నిర్వహించే ఈ జాబ్‌ మేళాలో క్విస్‌, దోంతస్‌, ఫ్రెష్‌ఫ్రూటీ, జ్యాస్‌ ప్రైవేట్‌ కంపెనీల పాల్గొంటాయన్నారు. రిలేషన్‌ షిప్‌ ఎగ్జిక్యూటివ్‌ పోస్టుకు ఇంటర్మీడియెట్‌, ఏదైనా డిగ్రీ చదివిన విద్యార్థులు అర్హులన్నారు. ఫ్యాక్టరీ వర్క్‌ డెలవరీ వర్క్‌ పోస్టులకు పది, ఇంటర్‌, ఐటిఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ చదివిన వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారు బెంగళూరు రెండేళ్ల తర్వాత నంద్యాలలో పని చేయాల్సి ఉంటుందన్నారు. వీరికి నెలకు రూ. 15000లు జీతం వసతి కల్పిస్తారని తెలిపారు.

నిండుగా తుంగభద్ర.. అయినా అభద్రతే.!

- టీబీ డ్యాం నిండినా నీటి విడుదలపై తొలగని అయోమయం
- రబీ సీజన్‌లో పంటల సాగుపై సందిగ్ధత
- ఖరీఫ్‌లోనూ స్పష్టత లేక ఇబ్బందులు పడ్డ రైతులు
- పూర్తిస్థాయిలో నిండని ఎత్తిపోతల రిజర్వాయర్లు



తుంగభద్ర దిగువ కాలువ



అడుగంటిన పూలచింత రిజర్వాయర్‌

ఎమ్మిగనూరు: టీబీ డ్యాం నిండుగా ఉన్నా.. తుంగభద్ర దిగువ కాలువ పరిధిలోని ఆయకట్టు భూములకు సాగునీటిపై స్పష్టత కొరవడింది. పాలకులు, అధికారుల మధ్య సమన్వయం లేక ఆగస్టునెలలో సాగునీటి సలహా సంఘం (ఐఏబీ) సమావేశం మొక్కుబడిగా ముగించారు. ఖరీఫ్‌సాగులో ఎన్నెకరాలకు నీరిస్తారో, ఏఏ పంటలకు నీరిస్తారో స్పష్టం చేయకపోవటంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. అదృష్టవశాత్తు వర్షాలు కురవడంతో సాగుచేసిన ఖరీఫ్‌ పంటలు అరకొరగా నైనా చేతికందుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు తుంగభద్ర డ్యాం మళ్లీ నిండింది. రబీ పంటలకైనా సాగునీటి విషయంలో ఇరిగేషన్‌ అధికారులు స్పష్టత ఇస్తే పంటల ప్రణాళికలు సిద్ధం చేసుకొనే వీలుంటుందని రైతులు పేర్కొంటున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో రెండు సీజన్లలో నీరు..

వెనుకబడిన ఆదోని, ఎమ్మిగనూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని ఆలూరు, మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గాలతో పాటు కోడుమూరు, కర్నూలు పరిసర ప్రాంతాలకు తుంగభద్ర దిగువ కాలువ నీరే శరణ్యం. ఈ కాలువ ద్వారా జిల్లాలో 1.53లక్షల ఎకరాలకు సాగునీరు అందాలి. ఖరీఫ్‌లో 43,360 ఎకరాలు, రబీలో 1.09 లక్షల ఎకరాలకు నీరివ్వాల్సి ఉంది. వైఎస్సార్‌సీపీ హయాంలో మూడేళ్లపాటు ఖరీఫ్‌, స్టాండింగ్‌ క్రాప్‌తో పాటు రబీ పంటలకు ఎల్లెల్సీ నీరు విడుదల చేయటంతో పంటలు విస్తారంగా పండాయి. ఈ ఏడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఖరీఫ్‌ పంటపై సాగునీటి సలహా సంఘం సమావేశం నిర్వహించినా నీటి విడుదలపై స్పష్టత ఇవ్వలేదు. రబీ ఎల్లెల్సీ కింద 80వేల ఎకరాలు, గాజులదిన్నె ప్రాజెక్టుకింద 15వేల ఎకరాలకు నీరందించే చర్యలు చేపట్టవచ్చని అధికారులు లెక్కలు కడుతున్నారు. ఈ ఏడు డ్యాంలో నీరు నిండుగా ఉన్నా ఖరీఫ్‌ పంటపై స్పష్టత కొరవడి రైతులు ఇబ్బందులు పడ్డారు. రబీ సీజన్‌లో నైనా ఆయకట్టుతోపాటు ఎల్లెల్సీ పరిధిలోని పులికనుమ ప్రాజెక్టు, గాజులదిన్నె ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో నింపి తద్వారా కూడా పంటలకు సాగునీరందించే ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

250 టీఎంసీలు సముద్రం పాలు

ఈఏడాది తుంగభద్ర డ్యాంకు గణనీయమైన వరదనీరు చేరింది. జిల్లాలోని ప్రధాన సాగునీటి వనరుల్లో ముఖ్యమైనది తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ).తుంగభద్ర డ్యాం పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు టీబీ డ్యాం మళ్లీ నిండింది. దీంతో మరోసారి గేట్లు ఎత్తి నీటిని కిందకు వదిలారు. అలా ఇప్పటివరకూ 250టీఎంసీల నీరు సముద్రంపాలు అయినట్లు ఇరిగేషన్‌ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అయితే సాగునీటి చెరువులు, ఎత్తిపోతల పథకాల రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపడంలో అధికార యంత్రాంగం అలసత్వం చూపారు. ఎల్లెల్సీ రైతుల్లో రబీ పంటపై ఆశలు పెంచుతున్నా అధికారుల తీరు ఆందోళనకు గురిచేస్తోంది. తుంగభద్ర డ్యాంలో



మాగాణి భూముల్లో వేసిన మెట్టపంట

నీటి స్టోరేజీ సామర్థ్యం 105టీఎంసీలు కాగా ప్రస్తుత డ్యాంలో నీరు 101.421టీఎంసీలను దాటింది. డ్యాం నీటి నిలువ సామర్థ్యం(ఎఫ్‌ఆర్‌ఎల్‌ లెవెల్‌) 1633 అడుగులుకాగా ప్రస్తుతం 1631.91 అడుగులకు నీరు చేరింది. సోమవారం డ్యాంలోకి చేరే నీరు(ఇన్‌ఫ్లో) 15,792 క్యూసెక్కులు కాగా అవుట్‌ఫ్లో 15,432 క్యూసెక్కులు ఉంది.

పంటసాగుపై ఐఏబీలో స్పష్టత వచ్చే అవకాశం



తుంగభద్ర దిగువ కాలువ పరిధిలోని ఆయకట్టు పొలాలకు ఈఏడాది ప్రారంభంలో సాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. అందువల్లే ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణంపై స్పష్టత రాలేదు. ప్రస్తుతం టీబీ డ్యాంలో పూర్తిస్థాయి నీటిమట్టం చేరుకుంది. ఇన్‌ఫ్లో పెరగటంతో గేట్లు ఎత్తి నీటిని కిందకు వదిలారు. నవంబర్‌లో జరిగే ఐఏబీ (సాగునీటి సలహా సంఘం) సమావేశంలో రబీలో ఎన్నెకరాలకు సాగునీరివ్వడంలో జిల్లా ఉన్నతాధికారులు స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. – జి.శైలేశ్వర్‌,ఎల్లెల్సీ ఈఈ

ఎత్తిపోతల పథకాలు అస్తవ్యస్తం

భారీ వర్షాలకు తుంగభద్ర నది ఉప్పొంగుతున్నా అధికారుల అలసత్వం..ప్రభుత్వ ప్రేక్షక పాత్రతో ఎత్తిపోతల పథకాలు నీరుగారుతున్నాయి. వరద నీటితో పులికనుమ ప్రాజెక్టు, సాగునీటి చెరువులు, గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాల రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపి ఉంటే రైతులకు మరింత ప్రయోజనం చేకూరేది. దుద్ది రిజర్వాయర్‌కు నీటిని మళ్లించే మోటార్లు పనిచేయడం లేదు. మూగలదొడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ఒకే మోటారుతో రైతులకు నీరందిస్తున్నారుగానీ రిజర్వాయర్‌ నింపడం లేదు. పులికనుమ పైపులైన్‌ లీకేజీలు రైతులకు ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. బసలదొడ్డి, చిలకలడోణ ప్రాజెక్టులకు అరకొరనీరే. పూలచింత ఎత్తిపోతల పథకానికి రైతులు చందాలు వేసుకొని నడుపుకుంటున్నారు. తుంగభద్రనదిలో నీరున్నా తీరంలోని ఎత్తిపోతల పథకాలన్నీ అస్తవ్యస్తంగా మారాయి.

అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్‌ మౌర్య భరద్వాజ్‌

ఆదోని రూరల్‌: పబ్లిక్‌ గ్రీవెన్స్‌ రిడ్రెసెల్‌ సిస్టం–పీజీఆర్‌ఎస్‌ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్‌కలెక్టర్‌ మౌర్య భరద్వాజ్‌ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్‌ కలెక్టర్‌ కార్యాలయంలో పబ్లిక్‌ గ్రీవెన్స్‌ రిడ్రెసెల్‌ సిస్టం–పీజీఆర్‌ఎస్‌లో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ ఆఫ్‌ సర్వేయర్లు వేణుసూర్య, శ్రీనివాసరాజు, డీఎల్‌డీపీఓ నూర్జహాన్‌, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ పద్మజ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి, ఉప తహసీల్దార్‌ వలిబాషా పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించండి

కోసిగి: గురు రాఘవేంద్ర ప్రాజెక్ట్‌ పరిధిలోని మాధవరం, బసల దొడ్డి ఎత్తిపోతల పథకాలను వెంటనే పునరుద్ధరించాలని ఆంధ్ర ప్రదేశ్‌ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్లు, కోసిగి మండల అధ్యక్ష ,కార్యదర్శులు కె.వీరేష్‌, పూజారి శ్రీనివాసులు కోరారు. సోమవారం ఆదోని సబ్‌ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మాధవరం, బసలదొడ్డి ఎత్తిపోతల పథకాలను మూడు నెలల క్రితం దుండగులు ధ్వంసం చేశారన్నారు. ఇప్పటి వరకు మరమ్మతులకు నోచుకోవడంలేదన్నారు. ఖరీఫ్‌ ముగిసి పోయి రబీ సీజన్‌ ప్రారంభమైందని, తుంగభద్ర నదిలో పుష్కలంగా నీరు ప్రవహిస్తోందని, కనీసం రబీలో నైనా ఆ పథకాల నుంచి సాగునీటిని అందించాలని కోరారు.

ఇన్‌చార్జి హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్‌: పట్టణంలోని ఆర్‌ఆర్‌ లేబర్‌కాలనీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ యూనిట్‌ రద్దుకు కారణమైన ఇన్‌చార్జి హెచ్‌ఎం రమేష్‌నాయుడిపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం నాయకులు నాగరాజు, లక్ష్మన్న, కిరణ్‌, నరసింహరాజు సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

ట్రాఫిక్‌ నియంత్రణకు ప్రజలు సహకరించాలి



మాట్లాడుతున్న ట్రాఫిక్‌ సీఐ గంటా సుబ్బారావు

ఆదోనిటౌన్‌: పట్టణంలో రోజురోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్‌ సమస్య నియంత్రణకు ప్రతిఒక్కరూ సహకరించాలని మున్సిపల్‌ కమిషనర్‌ ఎం.కృష్ణ, ట్రాఫిక్‌ సీఐ గంటా సుబ్బారావు కోరారు. సోమవారం ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలో ఇరుకు రోడ్లు, ఆపై ట్రాఫిక్‌ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వ్యాపారులు, వాహనాల చోదకులు సహకరించాలని కోరారు. ఎంఎం రోడ్డు, బీఎస్‌ రోడ్డు, ప్రభాకర్‌ టాకీస్‌ రోడ్డు, కొత్త బస్టాండు రోడ్డు తదితర ప్రాంతాల్లో నిత్యం రద్దీగా ఉంటుందని చెప్పారు. వ్యాపారులు రోడ్లను ఆక్రమించుకుని వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నారని, అలాంటి వాటికి స్వస్తి పలకాలన్నారు. దుకాణాల హద్దు మేరకే వ్యాపారాలు జరుపుకోవాలని సూచించారు. అక్రమ కట్టడాల కూల్చివేతలో రాజీ ప్రసక్తే లేదన్నారు. తోపుడుబండ్లపై వ్యాపారాలు నిర్వహించే వారు ప్రజలకు ఇబ్బందిలేకుండా చూసుకోవాలన్నారు. పట్టణంలోకి లారీల్లో సరుకులు తీసుకొచ్చే వ్యాపారులు ఉదయం 8 గంటల్లోపే లోడింగ్‌, అన్‌లోడింగ్‌ చేసుకోవాలన్నారు. మధ్యాహ్నం 1 నుంచి 4 గంటల వరకు అనుమతి ఉంటుందన్నారు.

శబరిమలకు పాదయాత్ర



పాదయాత్రగా బయలుదేరుతున్న అయ్యప్పమాలధారులు

ఆదోని అర్బన్‌: ఆదోని పట్టణం నుంచి శబరిమలకు 16వ సారి పాదయాత్రగా అయ్యప్పస్వామి మాలధారులు సోమవారం బయలుదేరి వెళ్లారు. గురుస్వామి శ్రీనివాస్‌ ఆచారి ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ యాత్ర అనంతపురం, బెంగళూరు, సేలమ్‌, డిండిగల్‌, తేని, కుంబ్లీ, పులిమే మీదుగా నెల రోజుల్లో శబరిమల సన్నిధానం చేరుకుంటుందని అయ్యప్పమాల ధారులు తెలిపారు. ఈ యాత్రలో స్వాములు పంపారెడ్డిస్వామి, మల్లిస్వామి, ప్రహ్లాదస్వామి, రంగన్నస్వామి, శ్రీనివాస్‌ రెడ్డిస్వామితో పాటు మొత్తం 15 మంది స్వాములు బయలుదేరినట్లు తెలిపారు.

చేపల పెంపకానికి 1న వేలం

కోసిగి: పులికనుమ రిజర్వాయర్‌లో చేపల పెంపకానికి నవంబర్‌ 1వ తేదీన మండల పరిషత్‌ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆదోని డివిజన్‌ మత్స్యశాఖ పర్యవేక్షకులు డి. నాగరాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 01-07-2024 నుంచి 30-06-2025వ తేదీ వరకు కోసిగి సమీపంలోని పులికనుమ రిజర్వాయర్‌లో చేపలను పెంచుకోవచ్చన్నారు. ఇందులో ఇప్పటికే 4 నెలలు గడిచి పోగా నెలల కాలానికి వేలం వేయబడుతోందన్నారు. ఇందుకు గాను ప్రభుత్వం సర్కారు సవాలు రూ. 74,879 నిర్ణయించినట్లు తెలిపారు. దీనిని తగ్గించే అవకాశం లేదన్నారు. ఇది వరకు చేపల పెంపకం బహిరంగ వేలం పాటను రెండు సార్లు వివిధ కారణాలచే వాయిదా వేయించారు. చివరి సారిగా జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు 1న మరో సారి వేలం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తి కలిగి వారు రూ.10వేలు డిపాజిట్‌ చేసి, తమ ఆధార్‌ కార్డుతో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రంలో ప్రముఖ ఆలయంగా తీర్చిదిద్దుదాం



ప్రసాదం సంచులను విడుదల చేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయాన్ని రాష్ట్రంలో ప్రముఖ ఆలయంగా తీర్చిదిద్దుదామని, అందుకు అందరి సహకారం అవసరమని ఆలయ ఈఓ, డిప్యూటీ కమిషనర్‌ విజయరాజు అన్నారు. సోమవారం తన చాంబర్‌లో దేవాదాయశాఖ ఎస్‌ఈ సతీష్‌, ప్రముఖ వాస్తుశాస్త్ర అధికారి నాగేశ్వరరావు, అసిస్టెంట్‌ అధికారి సుబ్రహ్మణ్యం, ఏఈ దేవేందర్‌ రెడ్డి, వైదిక కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. సంక్రాంతి పండుగలోపు ఏఏ అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయాలో చర్చించారు. ఇకపై తూర్పున ఉన్న రాజగోపురం ద్వారా భక్తులకు ప్రవేశం కల్పించాలని సూచించారు. రాజగోపురాలకు కలశాలు, ఆలయంలో గణనాథుని విగ్రహ ప్రతిష్టాపన చేయాలన్నారు. అంతకు ముందు వైదిక కమిటీ సభ్యులతో కలిసి ప్రసాదాల సంచులను విడుదల చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పర్యటించి ఎక్కడెక్కడ ఏఏ పనులు చేపట్టాలో పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, ఉప ప్రధాన అర్చకుడు మహదేవస్వామి, ఆలయ ఏఓ వెంకటేష్‌, మల్లికార్జున పాల్గొన్నారు.

మెనూ తప్పని సరిగా పాటించాలి

నందవరం : మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పని సరిగా పాటించాలని ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో ఎంపీపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ..విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత పాటించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, పిల్లలకు అర్థమయ్యే విధంగా బోధన చేయాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాబురాజు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని సెంట్రల్‌: ఎల్‌ఐసీ ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని లియాఫీ నాయకులు జయభారత్‌ రెడ్డి, శంకరయ్య గుప్త, సిద్ధలింగ, రఫిక్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి భోజనం విరామ సమయంలో భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ భీమా సంస్థకు అండగా ఉంటూ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న ఏజెంట్లను బలహీన పరచే కుట్ర జరుగుతుందన్నారు. ఏజెంట్ల కమిషన్‌ తగ్గింపును విరమించుకుని, పాత కమిషన్‌ పద్ధతిని అమలు చేయాలని కోరారు. లియాఫీ నాయకులు రామకృష్ణ ఏజెంట్లు పాల్గొన్నారు.

ఉరుకుందలో భక్తుల సందడి



ఈరన్నస్వామి

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి తరలి రావడంతో క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. భక్తులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహా మంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు.

ఆధార్‌ కేంద్రాలను ఏర్పాటు చేయాలి

పెద్దకడబూరు: పాఠశాల స్థాయిలో ఆధార్‌ సవరణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని యుటీఎఫ్‌ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే.ప్రశాంత్‌ భూపాల్‌, కే.శివకుమార్‌ కోరారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు శ్రీనాథ్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. యుటీఎఫ్‌ జిల్లా కౌన్సిలర్లు శంకర్‌నాయక్‌, రాఘవేంద్ర, లింగన్న నాయకులు బసవరాజు, హుసేనప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఆదోని అర్బన్‌: పట్టణ శివారులోని ఆస్పరి రోడ్డులో నివాసముంటున్న పాండిచ్చేరికి చెందిన సుందరేష్‌ (23) అనే యువకుడు సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్‌ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. సుందరేష్‌ పట్టణంలోని ఆస్పరి రోడ్డులోని ఓ హోటల్‌లో పనిచేస్తుండేవాడన్నారు. ప్రేమ విషయంలో మనస్థాపానికి గురై మృతిచెందినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సౌత్‌జోన్‌ కబడ్డీ పోటీలకు ఎంపిక



బడేసావలి

గోనెగండ్ల : మండల కేంద్రానికి చెందిన యువకుడు బడేసావలి సౌత్‌ జోన్‌ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. రాయలసీమ యూనివర్సిటీలో యూనివర్సిటీ జట్టు ఎంపిక పోటీలు జరగగా అందులో బడేసావలి ప్రతిభ కనపరడంతో చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో జరగనున్న సౌత్‌జోన్‌ కబడ్డీ చాంపియన్స్‌ పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. బడేసావలి ప్రస్తుతం కర్నూలులో బీపీఈడీ చేస్తున్నాడు.

ప్రజా సమస్యలపై పోరాటం

ఎమ్మిగనూరుటౌన్‌: ప్రజా సమస్యలపై ప్రభుత్వంతో పోరాటం చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్‌ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పద్మశాలి కల్యాణ మండపంలో 3వ పట్టణ మహాసభను నిర్వహించారు. విద్యుత్‌ చార్జీలు పెంచి కూటమి ప్రభుత్వం ప్రజలపై భారం మోపేందుకు సిద్ధమైందని, దీనిని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. జిల్లా నాయకులు రామాంజినేయులు, రాధాకృష్ణ మాట్లాడారు. అనంతరం పట్టణ ప్రధాన కార్యదర్శిగా గోవిందు, సభ్యులుగా రాముడు, రమేష్‌, కృష్ణ, లక్ష్మీనర్సయ్య, సురేష్‌తో పాటు పరో నలుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జాగ్రత్తలతో క్షయ వ్యాధి నివారణ



మాట్లాడుతున్న టీబీ సూపర్‌వైజర్‌ బాబు రావు

ఆదోని సెంట్రల్‌: జాగ్రతలు తీసుకుంటే క్షయ వ్యాధిని నివారించవచ్చని టీబీ సూపర్‌ వైజర్‌ బాబు రావు తెలిపారు. సోమవారం నేషనల్‌ స్కూల్‌ ఆఫ్‌ నర్సింగ్‌ కళాశాలలో జీఎన్‌ఎం చదువుతున్న విద్యార్థులకు క్షయ(టీబీ) వాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉన్నప్పుడు, తుమ్మినా.. దగ్గినా రక్తపుచారలు రావడం, ఆకలి, బరువు తగ్గిపోవడం, ఉదయం, సాయంత్రం వేళల్లో జ్వరం వచ్చినా గుర్తించి వారికి గళ్ల పరీక్షలు చేయించాలన్నారు. గళ్ల పరీక్షల్లో క్షయ వ్యాధి లక్షణాలు బయట పడుతాయని తెలిపారు. అక్కడ బయట పడకపోతే ఎక్స్‌రే తీయించాలని సూచించారు. టీబీ నమోదు అయిన వారికి ఆరు నెలలకు సరిపడ మందులు పౌష్టికాహారం కోసం ప్రతినెలా రూ.500 అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీబీ సెక్షన్‌ సిబ్బంది ఎం. గిరిజ, కె.నాగరాజు, ఎం. వీరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శేషాద్రి

కౌతాళం: ఆర్టీఐ (సమాచార హక్కు చట్టం 2005)పై ప్రతి ఒక్కరూ అవగహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి శేషాద్రి అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం వ్యవసాయ సిబ్బంది, ఆర్టీఐ వలంటీర్లతో అవగహనా సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ఆర్టీఐ చట్టం సామాన్య ప్రజలకు వజ్రాయుధంగా ఉపయోగపడుతుందన్నారు. ఒక్క దరఖాస్తుతో ప్రభుత్వం సామాన్య ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలను తెలుసుకోవచ్చన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్‌

కౌతాళం: జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రమైన కౌతాళంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం గ్రామ సర్పంచ్‌ పాల్‌దినకర్‌, ఎంపీడీఓ సుబ్బారాజు ఆధ్వర్యంలో చేపట్టారు. గ్రామంలోని ప్రధాన వీధులైన పాత బస్టాండ్‌, రాఘవేంద్రస్వామి కాలనీల వద్ద డ్రైనేజీ కాలువల్లో పూడిక తీశారు. ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. ఎంపీడీఓ వెంట ఈఓపీఆర్‌డీ జనార్దన్‌, కార్యదర్శి శివయ్య ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్‌: ఆలూరు మండలం కమ్మరచేడు గ్రామానికి చెందిన బెల్లం గోవిందప్ప అనే వ్యక్తి కర్ణాటక రాష్ట్రంలోని నగరాల నుంచి అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా సోమవారం రాత్రి మదిరె క్రాస్‌ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఇస్పీ ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు. అతని వద్ద నుంచి 90 ఎం.ఎల్‌. టెట్రా ప్యాకెట్లు 194 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చేనేతల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మిగనూరుటౌన్‌: చేనేత కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని చేనేత కార్మిక సంఘ నాయకులు భరణి కాలప్ప, సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోవిందు డిమాండ్‌ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్‌ శేషఫణికి, మున్సిపల్‌ కమిషనర్‌ గంగిరెడ్డి, ఎంపీడీఓ బంగారమ్మలకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. చేనేతలకు ముద్రలోన్‌లు మంజూరు చేయాలని కోరారు.

బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలి

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్ష, కార్యదర్శులు పవన్‌ తేజ, రంగస్వామి కోరారు. సోమవారం తహసీల్దార్‌ కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శ్రీనివాసులు, వినయ్‌, రియాజ్‌, కుమార్‌ పాల్గొన్నారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభించాలి

ఎమ్మిగనూరుటౌన్‌: ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి విజయ్‌కుమార్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేశారు. ర్యాలీగా వెళ్లి వినతిపత్రాన్ని తహసీల్దార్‌ శేషఫణికి అందజేశారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

ఎమ్మిగనూరురూరల్‌: పోలీసు అమరవీరుల త్యాగాలు మరవలేనివని డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. సోమవారం పోలీస్‌ అమరవీరుల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా డీఎస్పీతో పాటు టౌన్‌ సీఐ సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్డు పంపిణీ చేశారు. అలాగే అంబేద్కర్‌ పూలే అనాథాశ్రమంలో విద్యార్థులకు బ్రెడ్డు పంపిణీ చేశారు.

దళిత రైతులను అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్‌: మండలంలోని సంతెకుడ్లూరు గ్రామంలో దళిత రైతులను పొలాలకు వెళ్లకుండా అడ్డుకట్ట వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్‌ మండల ప్రధాన కార్యదర్శి బి.తిక్కప్ప తహసీల్దార్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో కేవీపీఎస్‌ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. దళిత రైతులు శేఖన్న, చిదానంద, ఈశ్వర్‌, లక్ష్మన్న, లంకేష్‌ పాల్గొన్నారు.